

లింగ నిర్ధారణ చట్టరీత్యానేరం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. -10లో▸



మణిపూర్‌లో నాజీల పాలన

మణిపూర్‌లో నాజీల పాలన సాగుతోందని రచయిత్రి కూర్పినా కిమ్మోవా అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన భారత్ బచావో సదస్సులో ఆమె మాట్లాడారు. -10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/25^0$

ఆకాశం మేఘావృతమై జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేయూలో రెండ్రోజుల వర్క్‌షాప్

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్‌పై రీజినల్ నాగపూర్‌లోని సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్‌ఫార్మింగ్, కేయూలోని మైక్రోబయాలజీ విభాగం సంయుక్తంగా ఈనెల 7, 8 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ ముంజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవర్క్‌షాప్ క్యాంపస్‌లోని మైక్రోబయాలజీ విభాగంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7న ఉదయం 10:30 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ ముఖ్య అతిథిగా, బాటనీ విభాగం ఎమిరిటస్ ప్రొఫెసర్ ఎంఎస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కళాశాలల అధ్యాపకుల తోపాటు వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని నిరసన



విద్యారణ్యపురి: సాధారణ భవిష్య నిధి (జీపీఎఫ్) ఖాతాలకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయాల ఎదుట తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించారు. నిరసన తెలిపిన వారిలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శులు కడారి భోగేశ్వర్, రావుల రమేశ్, టీపీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, జి.వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, సీనియర్ నాయకులు నటరాజ్, బిల్లా సుబ్బారావు, స్వామి, రాజేందర్ జిల్లా, మండలాల నాయకులు లక్ష్మయ్య, జె.స్వామి, కుమరస్వామి, సదయ్య, కొమురయ్య, పాలకుర్తి సదానందం, అశోక్, వీరభద్రం, భాస్కర్ అన్నారెడ్డి చక్రునాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



హన్మకొండ: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ నిలిపేయడంపై ఆర్టీసీ కార్మికులు మండిపడ్డారు. బిల్లు నిలిపివేతపై శనివారం వరంగల్ రీజియన్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు రెండు గంటల పాటు బస్సులు నిలిపి హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. కార్మికులు బస్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. బిల్లుకు వెంటనే ఆమోదం తెలపాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలు ఇవ్వాలని, గత పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, కార్మికులు పొదుపు చేసిన సొమ్మును వాడుకున్న మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

విధులు బహిష్కరించి వైద్య విద్యార్థుల ధర్నా



కాశిబుగ్గ: వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల ఎదుట ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ.. శనివారం విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. రెండేళ్లకోసారి స్టైఫండ్ 15 శాతం పెంచి అందిస్తామని 2014లో రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇచ్చిందన్నారు. కానీ.. 2014లో కాకుండా.. 2016లో హౌస్ సర్జన్లకు నెలకు రూ. 10,500 స్టైఫండ్ ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్టైఫండ్ పెంచలేదన్నారు. స్టైఫండ్ సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్టైఫండ్ పెంచి ఇవ్వకపోతే తరగతులు, విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. నిరసనలో హౌస్ సర్జన్లు, ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనునిత్యం.. స్నేహితం

స్నేహం మధురమైన జ్ఞాపకం


సాక్షి టాక్‌షో

- సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతం
- ఫేస్‌బుక్ ఫ్రెండ్‌షిప్‌తో మంచీచెడు ఉన్నాయి
- తప్పును ఎత్తిచూపేది నిజమైన స్నేహితులే
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' టాక్‌షో
- ఉత్సాహంగా పాల్గొన్న తాళ్ల పద్మావతి ఫార్మసీ కాలేజీ విద్యార్థినులు

సాక్షి, వరంగల్/కరీమాబాద్: 'స్నేహం.. చెప్పేది కాదు.. చేసేది.. కష్టాన్ని తీర్చేది.. సంతోషాన్ని పెంచేది.. మంచిచెడులతో సంబంధం లేకుండా ఎల్లకాలం వెంట ఉండేది. కష్ట సమయంలో నేనున్నానంటూ చేయూతనిచ్చేది.. బాల్యం నుంచి చివరి శ్వాస వరకు జీవన ప్రయాణంలో పరిచయమయ్యే మిత్రుల వల్ల మన ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. ప్రతీ ఏటా ఆగస్టు మొదటి ఆదివారం మాత్రమే ఫ్రెండ్ షిప్ డే నిర్వహించడం కాకుండా.. నిత్యం స్నేహితుల దినోత్సవంగా భావిస్తే బాగుంటుంది' అని వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కాలేజీ విద్యార్థినులు అంటున్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టాక్‌షోలో పలువురు విద్యార్థినులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.



ఫ్రెండ్‌షిప్ డేపై సాక్షి టాక్‌షోలో పాల్గొన్న తాళ్ల పద్మావతి ఫార్మసీ కాలేజీ విద్యార్థినులు



ఫ్రెండ్ ఒక గుడ్ బుక్..



ఆగస్టు మొదటి ఆదివారం అనగానే ఫ్రెండ్‌షిప్ డే గుర్తుకు రావడం కాదు. స్నేహం గొప్పది. కొన్ని సందర్భాల్లో ఇంట్లో చెప్పుకోలేనివి ఫ్రెండ్‌తో చెప్పుకుంటారు. బాధలో ఉన్నప్పుడే కాదు అన్ని సమయాల్లోనూ ఫ్రెండ్ షిప్ ఉండాలి. అవసరానికి వాడుకోవడం కాదు. ఫ్రెండ్ ఒక గుడ్ బుక్. దూరం చేసుకోవద్దు. - సౌమ్య

తప్పును చూపేవాళ్లే నిజమైన స్నేహితులు



మన జీవితంలోని సంఘటనలను ఒక్క ఫ్రెండ్‌కే చెబుతాము. అయితే కొందరు మనసులో ఒకటి పెట్టుకుని పైకి ఒకటి మాట్లాడతారు. అలాంటి వాళ్లు కరెక్టు కాదు. ముక్కుసూటిగా మాట్లాడి మన తప్పును చూపేవాళ్లే నిజమైన స్నేహితులు. స్నేహానికి డబ్బు, మతాలు ఉండవు. - తేజశ్విని

ఎప్పటికీ నిలిచిపోయేది స్నేహం..



కుటుంబ సభ్యుల తర్వాత స్నేహితులే ముఖ్యం. ఇంట్లో చెప్పుకోలేనివి స్నేహితులతో చర్చిస్తాము. మనం ఎలా ఉండాలో, జీవితంలో ఎలా ఎదగాలో కూడా స్నేహితులు చెబుతారు. మనసు బాగా లేకున్నా స్నేహితులు ఓదార్చుతారు. స్నేహం ఎప్పటికీ నిలిచిపోతుంది. - హిమవర్ష రాజశ్రీ

ఆన్‌లైన్ స్నేహంతో జాగ్రత్త..



ఆన్‌లైన్ స్నేహంలో మంచి, చెడు ఉంటాయి. ఇప్పుడంతా సోషల్ మీడియాను ఫాలో అవుతున్నారు. ఫ్రెండ్ రిక్వెస్టులు పంపించుకుంటారు. కొందరు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి, మరికొందరు ప్రేమ పేరుతో మోసపోతున్నారు. ఆకతాయిలైతే అమ్మాయిల్లాగా ప్రొఫైల్ క్రియేట్ చేసి చనువుగా మాట్లాడి వ్యక్తిగత విషయాలు తెలుసుకొని బ్లాక్‌మెయిల్ చేస్తుంటారు. అందుకే జాగ్రత్తలు పాటించాలి. -టి.అభినయ

ఎప్పుడైనా గొప్పదే..



చిన్నప్పటి స్నేహం కల్మషం లేకుండా ఉంటుంది. మనసులో ఏది ఉన్నా బయటకు అనేస్తారు. పెద్దయ్యాక ఏదైనా చెబుదామన్నా మళ్లీ ఎవరికి చెబుతారో అనే భయం ఉంటుంది. ఇప్పటి స్నేహం మంచిది కాదు అనడం లేదు. స్నేహం ఎప్పుడైనా గొప్పదే. - పి.అలేఖ్య

అపార్థాలు ఉండొద్దు..



స్నేహంలో అపార్థాలు అనేవి ఉండొద్దు. నిజమైన ఫ్రెండ్స్ ఎప్పుడైనా సపోర్టుగా ఉంటారు. ఇంట్లో ఏదైనా సంఘటన జరిగితే ఫ్రెండ్స్ మేమున్నామని ధైర్యం చెబుతారు. మన తప్పుఒప్పులు కూడా ముక్కుసూటిగా చెప్పినా అపార్థం చేసుకోకుండా వాస్తవాలను గ్రహించాలి. - జె.ఉమ

ఏ సందర్భంలోనైనా అవసరం



ఏ సందర్భంలోనైనా ఫ్రెండ్స్ అవసరం. కష్ట సుఖాలు, ఫీలింగ్స్‌ని కేవలం ఫ్రెండ్స్‌తోనే షేర్ చేసుకుంటాము. చదువు విషయంలో అసైన్‌మెంట్ ఇచ్చినప్పుడు, పరీక్షల సమయంలోనూ ఫ్రెండ్స్‌తో డిస్కస్ చేయడం ద్వారా ఫ్రీగా ఉండగలం. - బి.మురళీప్రియ

దూరం చేసుకోవద్దు



స్నేహితులంటే మనం తప్పు చేస్తుంటే ఊరుకోకుండా మంచి బాటలో నడిపించాలి. ఎదుటి వారి క్యారెక్టర్‌ను చూసి దూరం పోకుండా వారిని కూడా మార్చాలి. మంచి మార్గంలో నడిపించేలా ప్రయత్నించాలి. స్నేహితులను ఎప్పుడు దూరం చేసుకోవద్దు. - ఆర్.నిఖిత

కలకాలం ఉంటుంది



స్నేహం అనేది కలకాలం ఉంటుంది. బాధలో ఉన్నా, ఆపదలో ఉన్నా కేవలం ఫ్రెండ్స్ మాత్రమే అర్థం చేసుకుంటారు. అందుకే ఫ్రెండ్స్‌ను మరవొద్దు. బాధలో ఉంటే ఓదార్చుతారు. ఓల్డ్ ఫ్రెండ్ గోల్డ్ అయితే న్యూ ఫ్రెండ్ డైమండ్‌గా భావించాలి. - ఎండి.సంజు

నీ స్నేహం

- కష్టాల్లో ఉన్న స్నేహితులకు ఆపన్నహస్తం
- సామాజిక మాధ్యమాల ద్వారా హెల్పింగ్ హ్యాండ్స్
- నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా మరిన్ని కథనాలు 10లో

'గ్రేటర్'కు రూ. 250కోట్లు

టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయింపు

- రాజకీయాలు వద్దు.. నాలాల మూలాలు తేల్చండి
- హైదరాబాద్ స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం చేపట్టండి
- భవిష్యత్‌లో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకూడదు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష



హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇస్తుందని, వీటికి అదనంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.250కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. గ్రేటర్‌లో ఇటీవల వచ్చిన వరదలు, నష్టాలు, నివారణ చర్యలపై శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో శాసనసభ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. మంత్రి కేటీఆర్, ఇతర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నరేందర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, టి.రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, సీడీఎంఏ పమేలా సత్పతి, నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతోపాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు. భవిష్యత్‌లో భారీ వరదలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాల్సిన అంశాలపై కేటీఆర్ పలు సూచనలు చేశారు.

నాలాల అభివృద్ధిపై కఠినంగా వ్యవహరించాలి : మంత్రి కేటీఆర్

వరద నివారణ చర్యల్లో భాగంగా నాలాల మూలాలు తేల్చాలని, రాజకీయ జోక్యం లేకుండా కఠినంగా వ్యవహరించాలని మంత్రి కేటీఆర్ సుతిమెత్తగా హెచ్చరించారు. నాలాలపై కబ్జాలు లేకుండా చూడాలని ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులను ఆదేశించారు. కబ్జాల విషయంలో ఎవరైనా పేదలు ఉంటే ఒప్పించి , వేగంగా ముందుకు సాగాలన్నారు. వరదలతో భవిష్యత్‌లో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ముంపును అరికట్టేందుకు హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం తరహాలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని యంత్రాంగాన్ని కోరారు. హైదరాబాద్‌లో చేపట్టిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా గతంలో మాదిరే ఈసారి కూడా వర్షం పడినా ఇక్కడి జన జీవనానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ఇదే తీరును అమలు చేయాలని సూచించారు. అందుకోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్‌ను వరంగల్‌కు పంపించాలని ఈఎన్‌సీ శ్రీధర్‌ను ఆదేశించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

నగరంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాళోజీ ఆడిటోరియం, వంటి అనేక అభివృద్ధి పనులు ఎందుకు నత్తనడకన సాగుతున్నాయని మంత్రి కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పనులు పూర్తయ్యే విధంగా చూడాలని, అవసరమైతే ఎక్కువ మ్యాన్‌పవర్‌తో షిఫ్ట్‌ల వారీగా పనిచేయించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందుల విషయంలో అన్ని రకాలుగా ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

వాహనాల తనిఖీలో పోలీస్ కమిషనర్



వాహనాలు తనిఖీ చేస్తున్న సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు క్షేత్రస్థాయిలో చేపడుతున్న వాహనాల తనిఖీలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలను సీపీ పరిశీలించారు. వాహనాల రిజిస్ట్రేషన్, చాసిస్ నంబర్ల ఆధారంగా తెలంగాణ పోలీస్ యాప్‌ను వినియోగించుకుని తనిఖీలు నిర్వహించారు. అనంతరం హనుమకొండలోని అలంకార్ థియేటర్ దగ్గర ఆటో కన్సల్టెన్సీని ఆకస్మికంగా పరిశీలించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న సెకండ్ హ్యాండ్ వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వాహనాల తనిఖీల్లో అధికారులు కేవలం చాలన్లు మాత్రమే చూడకుండా తనిఖీలను మరింత లోతుగా నిర్వహించాలని, దీని ద్వారా చోరీలకు గురైన వాహనాలు దొరుకుతాయని తెలిపారు. తనిఖీల్లో వరంగల్, ట్రాఫిక్ ఏసీపీలు బొనాల కిషన్, భోజరాజు, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, కరుణాకర్, సీతారెడ్డి, వరంగల్ ట్రాఫిక్ ఎస్సై శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు జంక్షన్ రీ డెవలప్‌మెంట్‌కు శంకుస్థాపన



కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వేదిక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో శనివారం రాత్రి రైల్వే అధికారులు అమృత్ భారత్ స్టేషన్ స్కీం శంకుస్థాపన కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్)కు కాజీపేట జంక్షన్‌ను ఎంపిక చేసి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు దేశవ్యాప్తంగా ఏబీఎస్ఎస్‌కు ఎంపికైన 508 రైల్వేస్టేషన్లకు (కాజీపేట జంక్షన్ రీ డెవలప్‌మెంట్‌కు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు శనివారం రాత్రి నోడల్ ఆఫీసర్ ప్రశాంత్ కృష్ణసాయి తెలిపారు. ప్రధాని శంకుస్థాపనలో ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు, కార్మికులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని 10:50 నుంచి 11:00 గంటల వరకు మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందుకు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై రైల్వే క్యాంటీన్ ఎదుట వేదిక ఏర్పాటు చేసి విద్యుత్ లైట్లు, ఫౌండేషన్ స్టోన్ స్టాండ్ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట ఏడీఈఎన్ రాజు, సీటీఐ జనరల్ విజయ్‌కుమార్, సీసీఐ సజ్జన్‌లాల్, ఐఓడబ్ల్యూ టి.విజయ్‌శంకర్, ఎలక్ట్రిక్ మెయింటనెన్స్ ఎస్ఎస్ఈ రాజన్న, ఎలక్ట్రిక్ లోకో షెడ్ ఎస్ఎస్ఈ ఎ.కమలాకర్, ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు పాల్గొన్నారు.

కాల్వ కట్టకు గండి



కాల్వ కట్టకు పడిన గండి

హసన్‌పర్తి: నాగారం పెద్ద చెరువు కాల్వ కట్టకు గండి పడింది. నాగారం చెరువు నుంచి సూదన్‌పల్లి వైపునకు వెళ్తున్న కాల్వ కట్ట నాలుగు చోట్ల దెబ్బతిన్నది. నాలుగు రోజుల క్రితం అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈకాల్వ కింద సుమారు ఎనిమిది వందల ఎకరాలకు సాగు నీరందుతోంది. కాల్వకు గండి పడడంతో సమీపంలోని పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతోపాటు సుమారు 200 ఎకరాల మేర పంటలకు నీరందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు చోట్ల గండి పడడంతో నీరంతా సమీపంలోని వాగులోకి చేరుతోంది. కాల్వ కింద ఉన్న పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని, గండిని వెంటనే పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

వీఓఏలకు గౌరవ వేతనమివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఆత్మకూరు: గ్రామాల్లో వీఓఏలకు గౌరవ వేతనం ఇవ్వాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మూడో రోజు శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. వీఓఏలకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని, అలాగే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, ఏళ్లుగా పనిచేస్తున్న హోంగార్డులు, సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని, ఆశ వర్కర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని సంబంధిత మంత్రి పీఏ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

రెండో రోజు రెండు దరఖాస్తులు



కరీమాబాద్ : వరంగల్ రూరల్ (వరంగల్) జిల్లాలోని మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. అందులో భాగంగా రెండో రోజు శనివారం అన్నారం షరీఫ్ గ్రామంలోని షాపులకు 2 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ తెలిపారు. జిల్లాలోని 63 షాపులకు 41 షాపులు ఓపెన్ కేటగిరీ, 14 షాపులు గౌడ కులస్తులు, 6 ఎస్సీలు, 2 షాపులు ఎస్టీలకు రిజర్వేషన్ చేశారు. మద్యం షాపుల రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ఓపెన్ కేటగిరీలో..

నర్సంపేట పద్మశాలి భవన్ ప్రాంతంలోని 1, 2వ షాపు, చేపల మార్కెట్ ప్రాంతంలోని 2వ షాపు, అంగడి రోడ్డులోని 1, 2వ షాపు, నల్లబెల్లిలోని 1, 3వ షాపు, నెక్కొండలోని 1వ షాపు, ఖానాపురంలోని 1, 2వ షాపు, పాకాల అశోక్‌నగర్, చెన్నారావుపేటలోని 1వ షాపు, దుగ్గొండి, గిర్నిబావిలోని 2వ షాపు, దుర్గంపేట, జాన్‌పాక, ధర్మారం, కొనాయమాకుల, పరకాల మున్సిపాలిటీలోని 1 ,2, 3, 4, 5, 7వ షాపు, శాయంపేటలోని 1, 2వ షాపు, ఆత్మకూరులోని 1, 2వ షాపు, గుడెప్పాడ్ క్రాస్‌రోడ్డు, మచ్చాపూర్, నడికూడ, సంగెంలోని 1వ షాపు, వర్ధన్నపేట మున్సిపాలిటీలోని 2, 3వ షాపు, ఇల్లంద, చింతనెక్కొండ, ఏనుగల్లు, రాయపర్తిలోని 1, 2వ షాపు, అన్నారంషరీఫ్‌లోని 1, 2వ షాపులు ఓపెన్ కేటగిరీకి రిజర్వేషన్ చేశారు.

గౌడ కులస్తులకు..

నర్సంపేట పద్మశాలి భవన్ ప్రాంతంలోని 3, 4వ షాపుతోపాటు చేపల మార్కెట్ ప్రాంతంలోని 1 షాపు, అంగడిరోడ్డులోని 3వ షాపు, నెక్కొండలోని 3వ షాపు, ఉప్పరపల్లి, గిర్నిబావిలోని 1వ షాపు, పరకాల మున్సిపాలిటీలోని 8, 9వ షాపు, తహారాపూర్, కాపులకానిపర్తి, పర్వతగిరిలోని 1, 2వ షాపు, రాయపర్తిలోని 3వ షాపు గౌడ కులస్తులకు కేటాయించారు.

ఎస్సీలకు..

నెక్కొండలోని 4వ షాపు, చెన్నారావుపేటలోని 2వ షాపు, దామెర, పరకాల మున్సిపాలిటీలోని 6వ షాపు, సంగెంలోని 2వ షాపు, వర్ధన్నపేటలోని 1వ షాపు ఎస్సీలకు కేటాయించారు.

ఎస్టీలకు..

నెక్కొండలోని 2వ షాపు, నల్లబెల్లిలోని 2వ షాపు ఎస్టీలకు రిజర్వేషన్ చేశారు.

రెండో రోజు 9 దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ జిల్లా పరిధి 65 వైన్స్ షాపులకుగాను రెండోరోజు శనివారం కలెక్టరేట్‌లో 9 దరఖాస్తులను ఎక్సైజ్ సూపరిండెంట్ చంద్రశేఖర్ స్వీకరించారు. ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి 5, వరంగల్ అర్బన్ పరిధిలో 4 దరఖాస్తులను దరఖాస్తుదారులు అందజేశారు. ఆదివారం దరఖాస్తుల స్వీకరణకు సెలవు కాగా.. తిరిగి సోమవారం దరఖాస్తులను స్వీకరిస్తారు.

మాంగళ్య షాపింగ్‌మాల్ చేయూత


చీరలను పంపిణీ చేస్తున్న నమఃశ్శివాయ

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని మేడారం, ఊరట్టం, కన్నెపల్లి గ్రామాల్లోని వరద బాధితులకు హనుమకొండలోని మాంగళ్య షాపింగ్‌మాల్ నిర్వహకులు శనివారం చేయూతనిచ్చారు. బాధితులకు చీరలు అందించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ మాట్లాడుతూ ఇటీవల వరదలకు సర్వస్వం కోల్పోయిన బాధితులకు తనవంతు సాయంగా 1500 చీరలు అందించామన్నారు. దాతలు స్పందించి వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, మ్యగస్ యాడ్స్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డిపై తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 551/1, 551/2 లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అధికార పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి విక్రయిస్తున్నట్లు అధికార పార్టీకి చెందిన మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఆర్ఐ రహమాన్ విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో జెడ్పీటీసీతోపాటు మరికొందరిపై ఐపీసీ 447, 427 సెక్షన్ల కింద మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నంలో..

నెల్లికుదురు : భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శనివారం ఎస్సై వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన దోమల రాజయ్య- కమలమ్మ దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాజయ్య ఓ మహిళతో 10 ఏళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కమలమ్మతో గొడవలు మొదలయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి కమలమ్మ వేరుగా ఉండాలని తీర్మానం చేశారు. ఈ నెల 4న రాత్రి 9 గంటలకు కమలమ్మ ఉంటున్న ఇంట్లోకి వెళ్లాడు. అంతకు ముందే కమలమ్మ తయారు చేసి పెట్టుకున్న టమాట పచ్చడిలో విషం కలిపాడు. కమలమ్మ పచ్చడిని పోపు చేద్దామని వేస్తుండగా పొంగుతూ నురుగ వస్తుండటంతో అనుమానం వచ్చిచూడగా ఏదో వాసన వచ్చింది. వెంటనే తన భర్త చంపడానికి తను తినే పచ్చడిలో మందు కలిపినట్లు పోలీస్‌స్టేషన్‌లో కమలమ్మ ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



నీ స్నేహం



మన కోసం మనం ఎంపిక చేసుకునే ఓ అద్భుత బంధం స్నేహబంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచికి తగ్గట్టుగా మనమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. చిన్ననాటినుంచి కలిసిమెలిసి ఉంటూ.. ఒకరికి ఒకరుగా తోడుండేవారే స్నేహితులు. పాఠశాల.. ఇంటి పక్కన వారితోనో మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రయాణాల్లో పరిచయమయ్యేవారు స్నేహితులుగా ఉండేవారు.. కానీ, ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిచయాలతోకూడా స్నేహం కొనసాగిస్తున్నారు.. ఎంత వయస్సు పెరిగినా.. ఏరా.. ఒరేయ్.. అని పిలిచే స్నేహితులు ఉంటే జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందంటారు.. ఆ మధురమైన పిలుపును ఆస్వాదించే అనేకమంది. ఈనేపథ్యంలో నేడు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

- మిత్రులకు అండగా..
- ఆపదలో తోడుగా..
- ఏళ్లుగా కొనసాగుతున్న ఎన్నో స్నేహబంధాలు
- నేడు స్నేహితుల దినోత్సవం

ఆడపిల్లల విద్యకు చేయూత


సింగిల్ గర్ల్ చైల్డ్ అక్షితకు స్కూల్ ఫీజు చెల్లిస్తున్న ల్యాబర్తి మిత్ర మండలి బాధ్యులు

కాజీపేట అర్బన్: వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తికి చెందిన యువత ల్యాబర్తి మిత్ర మండలిని, మనఊరు మన కోసం పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మిత్రులంతా వివిధ వృత్తుల నేపథ్యంలో పట్టణంలో స్థిరపడినప్పటికీ గ్రామంలోని వారికి ఆపదలో చేయూతనిస్తున్నారు. రెండేళ్లుగా గ్రామంలోని సింగిల్ గర్ల్ చైల్డ్‌ను ఎంపిక చేసుకుని విద్యకు పూర్తి ఫీజును చెల్లిస్తున్నారు. గ్రామానికి చెందిన గొట్టం అశోక్ కోవిడ్‌తో మృతి చెందగా మిత్రులు, గ్రామస్తులు కలిసి రూ.3,15,700 కుటుంబానికి అందజేశారు. పోలెపాక దిలీప్ మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.10వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. మిత్రమండలిలో అన్నందాస్ కరుణాకర్, పిన్నింటి స్వాతి, తాత శ్రీధర్, వడిచెర్ల అమరేందర్, వీరమల్ల అనిల్‌కుమార్, అన్నమనేని అనిల్, బొల్లం శేఖర్, మడత రఘు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

కష్టాల్లో తోడుగా ఉంటూ..


కేసముద్రం : మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బాల్యమిత్రులు (ఫైల్)

కేసముద్రం: ఆపదలో ఉన్న బాల్యమిత్రుల కుటుంబాల కన్నీళ్లను తుడుస్తూ స్నేహమంటే సంతోషంలోనే కాదు, కష్టాల్లో కూడా తోడుగా ఉంటూ స్నేహమంటే ఇదేరా.. అని చాటుతున్నారు కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్ఎస్ 1993–94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు. కేసముద్రం విలేజ్‌కి చెందిన 20 మంది పూర్వవిద్యార్థులు 1998లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మిత్రుల్లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని ఆ మిత్రులు నిర్ణయించుకున్నారు. కేసముద్రం విలేజ్ నుంచి మొదలైన అసోసియేషన్ క్రమంగా మండల స్థాయి వరకు ఏర్పాటైంది. బ్యాచ్‌లో ఉన్న మిత్రులందరినీ కలుపుకుంటూ ఆపదలో ఉన్న మిత్రులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. రూ.25వేల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆర్థికసాయం అందించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఈ అసోసియేషన్‌లో 150 మంది మిత్రులు భాగస్వాములుగా ఉన్నారు.

కలిసి చదివారు..


స్నేహితుడికి సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

డోర్నకల్ : స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1988–89 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన నాటి మిత్రులు నేటికీ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులు.. తమలోని ఎవరికి ఆపద వచ్చినా తలా ఓ చేయి వేసి ఆదుకుంటున్నారు.. ఓ స్నేహితుడి కుమార్తె వివాహానికి రూ.45 వేలు, ఓ మిత్రుడికి పక్షవాతం రాగా చికిత్స నిమిత్తం రూ.15వేలు, ఓ స్నేహితురాలి భర్తకు అనారోగ్యమైతే రూ.15 వేలు, ఓ మిత్రుడు ప్రమాదంలో గాయపడితే రూ.25వేలు, ఓ మిత్రుడు అనారోగ్యంతో చనిపోతే రూ.10 వేలతో పాటు మిత్రుల పిల్లల చదువులకు ఆర్థిక సహాయమందిస్తూ తోడుగా ఉంటున్నారు. మిత్రుల్లో మహేష్, బొర్రా శ్రీనివాస్, వీరభద్రం, కోటేష్, లచ్చు నాయక్, రవీందర్ లింగయ్య, రామాచారి ఉన్నారు.

ఐకమత్యం చాటుతున్న బాల్య స్నేహితులు


కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి స్నేహితులు(ఫైల్)

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్ 1992–93 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు 30 ఏళ్లు దాటినా కలిసిమెలిసి ఉంటున్నారు. చిన్ననాటి స్నేహితులు ఎవరు ఆపదలో ఉన్నా.. అప్పన్నహస్తం అందిస్తున్నారు. తమ పాఠశాల విద్యార్థుల కోసం బెంచీలు, రెండు సైన్స్ ప్రయోగశాలల బల్లాలు అందజేశారు. బాల్యమిత్రుడు సాగంటి పాపయ్య మృతిచెందగా..బాధిత కుటుంబానికి రూ.50 వేలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మరో క్లాస్‌మెట్ కరుణాబాయి కుటుంబానికి రూ.50 వేలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నడిగోటి శ్రీశైలం కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించి బాసటగా నిలిచారు.

సామాజిక సేవలో 'బెస్ట్' ఫ్రెండ్స్


ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాలిసెట్ పుస్తకాలు అందజేస్తున్న బెస్ట్ ఫౌండేషన్ బాధ్యులు(ఫైల్)

విద్యారణ్యపురి: వివిధ వృత్తుల్లో ఉన్న వారు ఒక గ్రూప్‌గా ఏర్పడి 'బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్' పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ.. పలువురిచేత బెస్ట్ అనిపించుకుంటున్నారు. సుమారు వేయి మందితో క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు తమకు తోచినంత ఫండ్ పంపించడం ద్వారా జమ అయిన మొత్తంతో తమ ఫ్రెండ్స్‌లో ఎవరికి ఆపద వచ్చినా చేయూతనివ్వాలనుకున్నారు. కానీ, రిజిస్ట్రేషన్ అనంతరం ఫౌండేషన్ ప్రస్తుతం విద్యార్థులకు పోటీపరీక్షల పుస్తకాలు పంచడంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు చేస్తుంది. సమాజ హితం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తామంటున్నారు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు పులి దేవేందర్.

స్నేహానికి నిదర్శనం.. హెల్పింగ్ హ్యాండ్స్


ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు (ఫైల్)

తరిగొప్పుల : స్నేహితులకు తోడుంటూ స్నేహమంటే ఇదేరా అంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు తరిగొప్పులలోని ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు. తమతో కలిసి చదువుకున్న మిత్రులకు ఆపత్కాలంలో ఆర్థికంగా ఆదుకుంటూ స్నేహానికి నిర్వచనంగా నిలుస్తున్నారు. 2004–05 విద్యాసంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన 66 మంది సభ్యులతో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా నేటి వరకు 30 మంది స్నేహితులకు రూ.4 లక్షల పైగా అందజేసి ఆర్థికంగా ఆదుకున్నారు. గునింటి రాజపోషయ్య, కొయ్యడ శ్రీకాంత్, వంశీ, రమేష్ ముందుండి స్నేహితులను నడిపిస్తున్నారు.

మేమున్నామంటూ..


సంపత్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో స్నేహితులకు ఆర్థిక చేయూతనిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. మేమున్నామంటూ ముందుకొచ్చి ఆపదలో ఉన్న స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మిత్రుడు చాట్ల సంపత్‌కు రూ.1.3 లక్షలు, కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎన్ చారికి రూ.50 వేలు, క్వింటా బియ్యం అందజేశారు. మిత్రుడు నాగేశ్వరావు ఆర్టీసీ కండక్టర్‌గా ఉండగా.. బస్సు యాక్సిడెంట్‌లో కాళ్లు విరగడంతో రూ.70 వేలు నాగేశ్వరరావు కుమార్తె ఫీజు నిమిత్తం అందజేశారు.

ఆపదలో అండగా..


సాయం అందజేస్తున్న స్నేహితులు

కొడకండ్ల: తమతో కల్సి చదువుకొన్న స్నేహితులకు ఆపదలో అండగా ఉంటూ తమవంతు చేయూతనిస్తున్నారు.. కొడకండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 విద్యార్థులు. ఆరు సంవత్సరాలుగా స్నేహితుల అకాల మరణాలు, నిరుపేద స్నేహితుల కుటుంబాల్లో వివాహాలకు దాదాపు రూ.5లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. 30ఏళ్ల క్రితం కల్సిమెలసి చదువుకొని వివిధ హోదాల్లో అనేక ప్రాంతాల్లో జీనవం సాగిస్తూ.. ఆపద సమయంలో స్నేహితులకు అండగా ఉంటూ ఆదర్శనంగా నిలుస్తున్నారు ఈ స్నేహితులు. గ్రూప్ చైర్మన్ పసునూరి మధుసూదన్ ప్రత్యేక చొరవ తీసుకొని మిత్రుల సహకారంతో ముందుకెళ్తున్నారు.

నీ స్నేహం..



ఏనాడు పుట్టిందో ఈ తియ్యని రాగం
ప్రతిక్షణం ధ్వనించే హృదయ స్పందనం
ఎవరు పలికారో ఈ తారక వేదమంత్రం
ప్రతిమదిలో జపించే సుప్రభాతం

అనుకోని పలకరింపులు కలిపిన పరిచయం
తొలకరి చినుకులకు చిగురించిన వసంతం
ప్రతీది పంచుకునేంత దగ్గరైన ప్రయాణం
దూరంగా వెళ్లినా.. విడిపోని అనుబంధం

ఆపదలో ఆదుకునే ఆత్మీయ బంధం
కష్టాల్లో వెన్నంటే నిలిచే ధైర్యం
తిరిగి ఏమి ఆశించని నిస్వార్థ రూపం
ఏమిచ్చి తీర్చుకోను తీరని రుణం

కనిపెంచిన అమ్మ నాన్నలకు స్వరూపం
అడగకుండానే దేవుడిచ్చిన వరం
మరుపురాని జ్ఞాపకాలు రాసిన పుస్తకం
మరి మరి చదివే మధుర ప్రబంధ కావ్యం

కుల మత తారతమ్యాలకు అతీతం
పేద ధనిక అంతర భావాలు శూన్యం
ఒకగూటి పక్షుల్లా ఎగరడం నైజం
ఒకఇంటి బిడ్డల్లా ఉండటం నిజం.

- అందె భవాని

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- Hyd హైవే ఫేసింగ్ చిన్నపెండ్యాల LP Resort ప్రక్కన్న West 200' Road North 50' Road (102'x150') 1700 sft yards కమర్షియల్ Plot అమ్మబడును. 9781978970. [W-1002373]
- కాజీపేట్ వెస్ట్ సిటీ కుడా లేఅవుట్ ప్లాటు, రోడ్ నెం.3, 20x60, E/S ఫేస్, కార్నర్ బిట్ 141 గII మరియు కడిపికొండ రాజీవ్ గృహకల్ప వెనుక 450 గII నార్త్ ఫేస్ LRS ప్లాట్ అమ్మబడును. నో బ్రోకర్స్. సంప్రII 8328129670. [W-785687]
- హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలది. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F గోడ గేట్ పెట్టినది. అమ్మకం గII రూII 23000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785629]

HOUSE FOR SALE

- మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చII గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి. సెల్: 9032111600. [W-785639]

REAL ESTATE

- ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు వెంచర్ల కోసం ప్రముఖ సంస్థకు తక్షణం కావలెను. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తక్షణం సంప్ర : 9948801113 [HA-30033]

TO-LET

- To-Let 2BHK Marble Stone Fitting, 1000+1000 Sq. Feet Wide Space Big House For Residential & Office 1st Floor, @ Waranagal Under Bridge. Ph: 9440170497. [HA-484]

SERVICES

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-189122]
- మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

GOLD LOANS

- మీ తాకట్టులో ఉన్న బంగారం, ముత్తూట్, మనప్పురం మొదలగు అన్ని రకాల బ్యాంక్స్ జ్యువెలరీ షాప్స్ నుండి విడిపించి కొనబడును. Cont: 9959786253 [WA-7208]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్రII డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785698]

OLD AGE HOME

- త్రివేణి హోంకేర్: వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్: 9160900023, 9160900024. [H-189316]

BUSINESS OFFER

- RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana - 2.5 L. 50Kg's vacuum packed prawns / day. Rs.600 / pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433. [WB-19489]
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్: 9310515624, 8800496710 [DA-38443]

WANTED

- గణేష్ టింబర్ డిపో కమలాపూర్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. సంప్రII సెల్: 9440471253. [W-785637]
- శ్రీ సంతోష్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూరు బ్రాంచిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్, TA + DA ఇవ్వబడును. సెల్: 7702403972. [W-785636]
- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్రII 9703637320. [W-189117]

- హనుమకొండలో గల ప్రముఖ కార్ డేకార్స్ నందు పనిచేయుటకు Car Washing boys, Electricians, Supervisors, Accountant, House Keeping మరియు Marketing లో చేయుటకు M/F కావలెను. Cell: 7995621165. [WA-13305]
- ప్రముఖ బ్యాంక్ DSA లో పనిచేయుటకు లేడీ, (F) టెలికాలర్స్ & Male మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (వర్క్ ఫ్రం హోం కూడ కలదు) Qly: 10th-ఇంటర్, జీతం 10K+ఇన్సెంటివ్స్ సంప్ర: 8008897640. [H-788799]
- ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. సెల్: 88854 86421. [M-1221475]

WANTED TEACHERS

- To Teach Maths, Telugu Primary, Telugu & Phy.Science, Bio Higher Classes. VISHWATEJA HIGH SCHOOL, Gopalpur Road, Hanumakonda. Cell: 9959770643 [K-1185570]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

www.sakshi.com

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ
- జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం


కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

గీసుకొండ : లింగ నిర్ధారణ నివారణ చట్టం నిబంధనలను ఆస్పత్రి యాజమాన్యాలు తప్పకుండా పాటించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నేరం అవుతుందని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పీసీ అండ్ పీఎన్‌డీటీ వరంగల్ జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఎవరైనా డయాగ్నోస్టిక్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశురాములు, డాక్టర్ ప్రకాశ్, మధుసూదన్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి మిషన్ ఇంద్రధనుష్

వరంగల్ జిల్లాలో ఈ నెల 7 నుంచి 12 వరకు ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్-5 జాతీయ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ముందుగా ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. మందుల సరఫరాకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అదే సమయంలో అక్కడ జరుగుతున్న ఆశా డే సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. మాతృ, శిశు సంరక్షణ చర్యలు, గర్భిణుల నమోదు, గర్భిణుల పోషకాహారం, రక్తహీనత, గర్భంలో బిడ్డ పెరుగుదల, ప్రభుత్వాస్పత్రిలో సుఖ ప్రసవం, బిడ్డకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలు, ఈనెల 7న నిర్వహించబోతున్న మిషన్ ఇంద్రధనుష్-5 కార్యక్రమం, యువిన్ పోర్టల్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌సింగ్, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో నవీన్ రాజ్‌కుమార్, కాటగిరి ప్రసాద్, కలీం ఖాసీం, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్, రిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఆటోలను దొంగిలించే నిందితుడు దండ్ల గణేష్‌ను డివిజన్ కేంద్రంలో శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఆలె రాఘవేందర్ తెలిపారు. ఈ మేరకు సీఐ విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన నీరటి రాకేష్ గత నెల 30న రాత్రి తన ఇంటి ఎదుట ఆటోను ఉంచి ఉదయం చూసేసరికి లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్‌లో వీయూపీ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్లు గ్రామానికి చెందిన నిందితుడు దండ్ల గణేష్ ఘన్‌పూర్‌లో చోరీ చేసిన రాకేష్‌కు చెందిన ఆటోను హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. గణేష్ ప్రస్తుత నివాసం కూకట్‌పల్లి గాజులరామారం అని, ప్లంబర్‌గా పనిచేస్తూ ఆటోలను దొంగతనం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘన్‌పూర్‌తోపాటు నిందితుడు జూలై 30న కాజీపేటలో మరో ఆటో దొంగిలించాడని, కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. గతంలోనూ సైబరాబాద్‌లోని నాచుపల్లి, గుంటూరు జిల్లా చిల్లకల్లు, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆటోలు దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. నేరస్తుడి నుంచి రెండు ఆటోలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. హెచ్‌సీ మగ్దుమ్, కుమారస్వామి, శ్రీను, కుమార్ ఉన్నారు.

మణిపూర్‌లో నాజీల పాలన

- మణిపూర్ రచయిత్రి కూర్ఫినా కిమ్మోవా కొంగ్సాయి


సదస్సులో మాట్లాడుతున్న మణిపూర్ రచయిత్రి

నయీంనగర్: మా తాత ముత్తాల నుంచి ఇక్కడే ఉన్నామని బ్రిటిష్ వారితో మా పూర్వీకులు యుద్ధం చేశారని మణిపూర్ రచయిత్రి కూర్ఫినా కిమ్మోవా కొంగ్సాయి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో భారత్ బచావో సదస్సు హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎస్.రామబ్రహ్మం, డి.ప్రవీణ్‌కుమార్‌ల అధ్యక్షతన నిర్వహించగా.. కిమ్మోవా కొంగ్సాయి మాట్లాడారు. తాము భారతీయులమేనని మాకు విడిపోవాలని లేదని తమని తరిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హద్దుల కోసం మమ్మల్ని ఊచకోత కోస్తున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లో నాజీల పాలన సాగుతోందని అన్నారు. రాష్టంలోని కొండ ప్రాంతంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను దోచుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి కుట్ర జరుగుతోందని చెప్పారు. భారత భూభాగాన్ని కొండకోనల్లో కాపాడింది కూకీలేనని మాకు ప్రత్యేక ప్రాంతం హోదా కావాలన్నారు. తెలంగాణ ప్రజలు చాలా మంచి వారని తాను 2014 నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నానని అన్నారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వినిపించారు. మనువాద, మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బి.సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంతరాలున్న దేశంలో యూసీసీ వల్ల అనేక సమస్యలు వస్తాయని అందుకే అంబేడ్కర్ యూసీసీ ని ఆర్టికల్44లో చేర్చాడని తెలిపారు. దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా మాట్లాడుతూ ప్రజలందరు నిగ్రహం పాటించాలన్నారు. అనంతరం హనుమకొండ సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, ఎంసీపీఐ నాయకుడు హంసారెడ్డి ప్రసంగించారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు డా.ఎం.వెంగల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, వివిధ ప్రజా నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలో వ్యక్తిపై దాడి..!

- తీవ్రగాయాలతో స్టేషన్‌కు..
- తిట్టి పంపిన పోలీసులు

ఖిలా వరంగల్: ఆర్థిక లావాదేవీల విషయంలో ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈదాడిలో ఓ వ్యక్తి తీవ్రగాయాలతో పారిపోయి రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు తిట్టి పంపినట్లు సమాచారం. బాధితుడు దిక్కుతోచని స్థితిలో ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం. దాడి చేసుకున్న ఇరువురి పేర్లు సైతం శ్రీనివాసులు కావటం విశేషం. వీరు రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుంటారు. ల్యాండ్ పేపర్లు పెట్టి రూ.కోటి పైగా బ్యాంకు లోను తీసుకున్నారు. శనివారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువురు ఆర్థిక లావాదేవీలపై మాట్లాడుకుంటున్నారు. ఈక్రమంలో నేను కమీషన్ ఇంతే ఇస్తా.. ఏమీ చేసుకుంటావో.. చేసుకోమంటూ ఓ శ్రీనివాస్ మరో శ్రీనివాస్‌ను తీవ్ర పదజాలంతో తిట్టాడు.. ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈదాడిలో గణేష్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ తన వద్ద ఉన్న కత్తితో మరో శ్రీనివాస్ పొత్తికడుపులో పొడవగా తీవ్రగాయాలతో అక్కడి నుంచి పారిపోయి ఆటోలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అతన్ని చూసిన పోలీసులు ముందుగా ఎంజీఎంకు వెళ్లమని ఆగ్రహించినట్లు సమాచారం. గాయపడిన శ్రీనివాస్ అలియాస్ బ్యాంకు శ్రీనివాస్ సొంతూరు గోదావరిఖని కాగా, బతుకుదెరువు కోసం వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఏరియాలో నివాసం ఉంటూ బ్యాంకు లోన్స్ ఇప్పిస్తూ, రియల్‌స్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా గాయాలపాలై ఏ ఒక్క బాధితుడు స్టేషన్‌కు రాలేదంటూ సమాధానం ఇవ్వడం కొసమెరుపు.


చికిత్స పొందుతున్న శ్రీనివాస్